RNI: APTEL/26/A8235

# అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -26 | ఆదివారం 25 అక్టోబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్మయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-

**టీడీపీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలి**



04

**అక్షర దర్శిని**

దినపత్రికలో పని చేయడానికి
అనుభవం కలిగిన, జర్నలిజంపై
ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను.
కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

9912808090
8374168090



## సౌత్ అమలూరులో వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాలు

▶▶ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిక

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** తోటపల్లిగూడూరు మండలం సౌత్ అమలూరు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. నెల్లూరులోని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో శనివారం ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి కాకాణి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, సౌత్ అమలూరు గ్రామానికి చెందిన యువతతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషకరమన్నారు. గతంలో పార్టీలో పనిచేసిన కొందరు విభేదాల కారణంగా దూరమయ్యారని, ప్రస్తుతం పరిస్థితులను పునరాలోచించి తిరిగి పార్టీలోకి వస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక నాయకుల కృషితో ఈ చేరికలు సాధ్యమయ్యాయని తెలిపారు. 2024 ఎన్నికల్లో టీడీపీ విజయానికి పనిచేసిన వారిలో కొందరు తిరిగి వైఎస్సార్‌సీపీ నాయకత్వానికి మద్దతు ప్రకటిస్తూ పార్టీలోకి రావడం గమనార్హమన్నారు. యువత, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న వారు కూడా పార్టీలో చేరడం శుభపరిణామమని వ్యాఖ్యానించారు. టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై కాకాణి విమర్శలు గుప్పించారు. వైఎస్సార్‌సీపీ నుంచి బహిష్కరించిన వారిని టీడీపీలో చేర్చుకుని, వారు వైఎస్సార్‌సీపీని వీడి వచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి బలహీనపడుతోందని, వైఎస్సార్‌సీపీ క్రమంగా బలపడుతోందని అన్నారు. సోమిరెడ్డి వ్యవహారశైలిపై సొంత పార్టీ నాయకుల్లోనూ అసంతృప్తి ఉందని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని కాకాణి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి కుటుంబానికి తగిన గుర్తింపు, సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సౌత్ అమలూరుకు చెందిన కోడి రవి, కోడి శ్రీనివాసులు, ఇంట్లూరు లోకేష్, మబ్బు అనిల్, ఇంట్లూరు అనిల్, చక్రి, రవి, ప్రేమ్, డేవిడ్, ఎనూష తదితరులు పాల్గొని వైఎస్సార్‌సీపీలో చేరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. చేరికలకు కృషి చేసిన స్థానిక పార్టీ నాయకులకు కాకాణి కృతజ్ఞతలు తెలిపారు.





# యువ ఓటర్లే లక్ష్యం..

# డిజిటల్ ప్రచారమే అస్త్రం..

## ఓటర్లను ఆకట్టుకునేందుకు సోషల్ మీడియానే వేదికగా..

## వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో విస్తృత ప్రచారం

**పొదలకూరు,(అక్షరదర్శిని) :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ప్రచారానికి సరికొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. ఇంటింటి ప్రచారంతో పాటు డిజిటల్ ప్రచారానికి పెద్దపీట వేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. అభ్యర్థులు గతంలో తాము చేసిన సేవలు, ప్రజలకు అందుబాటులో ఉన్న తీరును వివరిస్తూ సంక్షిప్త సందేశాలు, వీడియోలను రూపొందించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. తమకు మరోసారి అవకాశం కల్పించాలని కోరుతూ ఓటర్లకు నేరుగా సందేశాలు పంపుతున్నారు. చదువుకోలేని ఓటర్లను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులే స్వయంగా మాట్లాడిన ఆడియో సందేశాలను రికార్డు చేసి వాట్సాప్ ద్వారా పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**వార్డుల వారీగా గ్రూపులు..** ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థులు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి వార్డు, గ్రామం, కాలనీకి సంబంధించిన ఓటర్లను గ్రూపుల్లో చేర్చి ప్రచార కార్యక్రమాలను వారికి చేరవేస్తున్నారు. తమ ప్రచార కార్యక్రమాలు, ప్రజలకు ఇచ్చే హామీలు, గతంలో చేసిన అభివృద్ధి పనులను వీడియోలు, ఫొటోల రూపంలో పంచుకుంటున్నారు.

**యువకుల ఓటుకు గాలం** కొత్తగా ఓటు హక్కు పొందిన యువతను ఆకర్షించేందుకు అభ్యర్థులు డిజిటల్ క్యాంపెయినింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఫేస్‌బుక్‌లో లైవ్ పోస్టులు పెడుతూ డివిజన్‌లోని సమస్యలను ప్రస్తావిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆకర్షణీయమైన షార్ట్ వీడియోలతో ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన వీడియోలను వాట్సాప్ స్టేటస్, సోషల్ మీడియా పేజీల ద్వారా విస్తృతంగా వైరల్ చేస్తూ యువ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ మంది ఓటర్లకు చేరువయ్యేందుకు కొందరు అభ్యర్థులు డిజిటల్ పాంప్లెట్లు, వీడియోలు, ఆడియో సందేశాలను వినియోగిస్తున్నారు. దీంతో ఎన్నికల ప్రచారంలో సంప్రదాయ పద్ధతులతో పాటు డిజిటల్ ప్రచారం కూడా కీలకంగా మారుతోంది.

## ఎన్నికల సందేహాల నివృత్తికి నిరంతరం హెల్ప్‌లైన్ సేవలు

**ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం.. కాల్ సెంటర్ నంబర్ 0861-2331261, వాట్సాప్ నంబర్ 7995576699**

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, వారి సందేహాలు, సమస్యలను పరిష్కరించేందుకు నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కాల్ సెంటర్ నిరంతరం సేవలందిస్తోందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ నెల 14న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి అక్టోబర్ 23వ తేదీ వరకు సుమారు 50 మంది ప్రజలు ఎన్నికలకు సంబంధించిన వివిధ సందేహాల నివృత్తి కోసం కాల్ సెంటర్‌ను సంప్రదించినట్లు వెల్లడించారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు సిబ్బంది సమాధానాలు అందిస్తున్నారని, పరిష్కరించాల్సిన సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.





**మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు** ప్రజలకు నిరంతరాయంగా సేవలు అందించేందుకు కాల్ సెంటర్‌లో మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రతి షిఫ్టులో ఎనిమిది మంది చొప్పున సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు అవసరమైన సమాచారం అందించడం, సందేహాలను నివృత్తి చేయడం, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం

03



**అభివృద్ధికి పట్టం కట్టండి: షరణి పొంగూరు**

▶▶ మిగతా 4 లో......



# ఎన్నికల సందేహాల నివృత్తికి నిరంతరం హెల్ప్‌లైన్ సేవలు

**మొదటి పేజీ తరువాయి**

కాల్ సెంటర్ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

**హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలి** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రజలకు ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఎదురైతే హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు.

హెల్ప్‌లైన్ కాల్ సెంటర్: 0861-2331261

వాట్సాప్ నంబర్: 7995576699

ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడంతో పాటు, తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# పొదలకూరు బిట్-2లో వైసీపీ అభ్యర్థి వాకాటి సంధ్య విస్తృత ప్రచారం

- కోటి రామయ్య శ్రామిక నగర్, వినాయక మన్యంలో ఇంటింటా ప్రచారం
- తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి



**పొదలకూరు,(అక్షర దర్శిని):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొదలకూరు బిట్-2 వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థి వాకాటి సంధ్య ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శనివారం ఊకోటి రామయ్య శ్రామిక నగర్, వినాయక మన్యం ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి, కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రానున్న ఎంపీటీసీ ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అభ్యర్థుల సమక్షంలో జడ్పీటీసీ నామినేషన్ల పరిశీలన



**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి దాఖలైన నామినేషన్ల పరిశీలన కార్యక్రమం కొనసాగుతోంది. ఎన్నికల అధికారులు అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్నారు. నామినేషన్ పత్రాల్లోని వివరాలు, సమర్పించిన ధ్రువపత్రాలు, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే అంశాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఈ ప్రక్రియలో అభ్యర్థులు, వారి ప్రతినిధులు పాల్గొంటున్నారు. నిబంధనల ప్రకారం పరిశీలన పూర్తయిన అనంతరం అర్హమైన నామినేషన్లపై అధికారులు తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు.



# పొదలకూరులో ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల పరిశీలన..





- 27న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం..
- అభ్యర్థుల వివరాలు నోటీసు బోర్డులో ప్రదర్శన..
- వివరాలు వెల్లడించిన రిటర్నింగ్ అధికారి సీహెచ్ విజయకుమార్ రెడ్డి..

**పొదలకూరు,(అక్షర దర్శిని) :** పొదలకూరు మండలంలో పరిషత్ ఎన్నికలకు సంబంధించి శనివారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచి పరిశీలన వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల అధికారులు, పోలీసు శాఖ సమన్వయంతో వ్యవహరించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి సీహెచ్ విజయకుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. నామినేషన్ల పరిశీలనలో ఆమోదం పొందిన అభ్యర్థుల వివరాలను మండల పరిషత్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

**27న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం..** పోటీ నుంచి తప్పుకోదలిచిన అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు అదే రోజు మధ్యాహ్నం 3 గంటలలోపు ఫారం-బి సమర్పించాలని సూచించారు. నామినేషన్లను ఉపసంహరించుకోని వారిని స్వతంత్ర అభ్యర్థులగా గుర్తించి ఎన్నికల నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయించే ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు.

**పటిష్ట పోలీసు బందోబస్తు..** పరిషత్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పురస్కరించుకుని పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పర్యవేక్షణలో పొదలకూరు సీఐ గుత్తి వెంకట్రావు, ఎస్సై శివ రాకేష్ తమ సిబ్బందితో కలిసి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహిస్తూ నామినేషన్ల స్వీకరణ, పరిశీలన ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకున్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు రిటర్నింగ్ అధికారి కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం!





- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించండి
- బిరదవోలులో అన్నలూరు సుమలత విజయానికి విస్తృత ప్రచారం
- కూటమి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటింటా ప్రచారం

**పొదలకూరు,(అక్షర దర్శిని):** గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని బిరదవోలు ఎంపీటీసీ అభ్యర్థి అన్నలూరు సుమలత పేర్కొన్నారు. పరిషత్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగియడంతో టీడీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా శనివారం బిరదవోలు గ్రామంలో సుమలత విజయాన్ని కాంక్షిస్తూ ఆమె భర్త అన్నలూరు చెన్నకృష్ణమ నాయుడు పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులతో కలిసి విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

**సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరణ** ప్రచారంలో భాగంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగాలంటే పరిషత్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు.

**సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి** బిరదవోలు ఎంపీటీసీ స్థానానికి పోటీ చేస్తున్న అన్నలూరు సుమలతకు, జడ్పీటీసీ స్థానానికి పోటీ చేస్తున్న కలిచేటి ప్రభాకర్ రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ నాయకులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

**గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి** ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నలూరు సుమలత తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, పక్కా ఇళ్లు అందించడంతో పాటు గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు.

**ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు** ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, టీడీపీ నాయకులు రావుల శ్రీనివాసులు గౌడ్, వెన్నపూస రమణారెడ్డి, ఎత్తపు వెంకటరెడ్డి, రావుల భాస్కర్ గౌడ్, మలిపెద్ద మధుసూదన్ రావు, బడుగు శ్రీనివాసులు, వెంపులూరు రామకృష్ణ గౌడ్, వెంపులూరు బాలకృష్ణ, నాగేళ్ల వెంకటేశ్వర్లు, గూడూరు శ్రీనివాసులు, బడుగు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల పరిశీలన అనంతరం..





- పొదలకూరు మండల పరిషత్ బరిలో 87 మంది అభ్యర్థులు..
- 19 ఎంపీటీసీ స్థానాలకు పోటీ...
- వైసీపీ నుంచి 45, టీడీపీ నుంచి 39 మంది అభ్యర్థులు..
- బీజేపీ, కాంగ్రెస్, జనసేన నుంచి ఒక్కొక్కరు చొప్పున బరిలోకి..

**పొదలకూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగిసిన అనంతరం బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలు వెల్లడయ్యాయి. మండలంలోని 19 ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 87 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

**పార్టీల వారీగా అభ్యర్థుల వివరాలు:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) నుంచి అత్యధికంగా 45 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నుంచి 39 మంది పోటీలో ఉన్నారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ), కాంగ్రెస్, జనసేన పార్టీల నుంచి ఒక్కొక్కరు చొప్పున నామినేషన్లు ఆమోదం పొందాయి.

పార్టీల వారీగా ఆమోదం పొందిన నామినేషన్లు:

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) -- 45
- తెలుగుదేశం పార్టీ (టీడీపీ) -- 39
- భారతీయ జనతా పార్టీ (బీజేపీ) -- 1
- కాంగ్రెస్ పార్టీ (ఐఎన్‌సీ) -- 1
- జనసేన పార్టీ -- 1

**మొత్తం ఆమోదం పొందిన నామినేషన్లు -- 87**

మండలంలో ప్రధాన పోటీ టీడీపీ, వైసీపీ మధ్యే ఉండనుండగా, నామినేషన్ల పరిశీలన అనంతరం వెల్లడైన ఈ గణాంకాలు స్థానిక రాజకీయ సమీకరణాలపై ఆసక్తిని పెంచుతున్నాయి.

# 67, 68 డివిజన్లలో కూటమి ప్రచార జోరు







▶▶ రమాదేవి రోడ్‌షోలకు స్పందన.. ఇంటింటా అభివృద్ధి ప్రచారం

▶▶ గెలుపుపై కూటమి నేతల ధీమా

**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో కూటమి తన జోరును పెంచింది. నగరంలోని 67, 68వ డివిజన్లలో మంత్రి పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి నిర్వహించిన రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారం సందడిగా సాగాయి. కార్పొరేటర్ అభ్యర్థులు నిమ్మల ప్రసన్నకుమారి, కట్టుమూరి శైలజతో పాటు మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌కు మద్దతుగా కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు.రోడ్‌షోల వెంట కార్యకర్తలు ఉత్సాహంగా కదలగా, రమాదేవి ఇంటింటికీ వెళ్లి స్థానికులను పలకరిస్తూ ఓటర్లను కలిశారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రచార కార్యక్రమాలతో ఆయా డివిజన్లలో ఎన్నికల సందడి నెలకొంది.

**అభివృద్ధి పనులే ప్రధాన ప్రచారాంశాలు** నెల్లూరు నగర అభివృద్ధికి గత రెండున్నరేళ్లలో ప్రభుత్వం రూ.5,748 కోట్లు కేటాయించిందని రమాదేవి వివరించారు. నగరాన్ని హరితవనంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, నగర సుందరీకరణ, పాఠశాలల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి అందించడం, పార్కులను ఆధునీకరించడం, పేదల ఇళ్ల స్థలాల సమస్యలను దశలవారీగా పరిష్కరించడం వంటి అంశాలను ప్రస్తావించారు.మంత్రి నారాయణ ఆధ్వర్యంలో నగరంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొంటూ, మరింత అభివృద్ధి సాధించేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు.

**మెజారిటీపై కూటమి ఆశలు** ప్రచారానికి లభిస్తున్న స్పందన తమ అభ్యర్థుల విజయానికి దోహదపడుతుందని కూటమి నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్ లక్షకు పైగా మెజారిటీ సాధిస్తారని కూటమి శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అయితే, ఎన్నికల ఫలితాలపై తుది నిర్ణయం ఓటర్ల తీర్పుపైనే ఆధారపడి ఉంటుంది.

# రొమ్ము క్యాన్సర్‌పై ప్రతి మహిళకు అవగాహన అవసరం






▶▶ ముందస్తు గుర్తింపుతో మెరుగైన చికిత్సకు అవకాశం

▶▶ మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

**నెల్లూరు,(అక్షర దర్శిని):** రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం ద్వారా సకాలంలో చికిత్స పొందేందుకు, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.రొమ్ము క్యాన్సర్‌పై మహిళల్లో అవగాహన కల్పించేందుకు రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ బొమ్మ నుంచి రెడ్‌క్రాస్ కార్యాలయం వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవడం, వ్యాధి లక్షణాలను గుర్తించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం ఎంతో ముఖ్యమన్నారు.ప్రతి మహిళకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన ఉండాలని, తమ కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల మహిళలకు కూడా ఈ విషయాలను తెలియజేయాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం బలంగా ఉంటుందని పేర్కొన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ముందుకొచ్చిన రెడ్‌క్రాస్ సంస్థతో పాటు వైద్యులు, ఆరోగ్య సిబ్బందిని అభినందించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా మహిళల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించవచ్చని తెలిపారు. మహిళలు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైనప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనల మేరకు తగిన చికిత్స పొందాలని ఈ సందర్భంగా సూచించారు.

# వైఎస్సార్‌సీపీలో చేరిన గురువాయపాలెం టీడీపీ కార్యకర్తలు

▶▶ కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో 15 కుటుంబాల చేరిక



**నెల్లూరు,(అక్షర దర్శిని) :** పొదలకూరు మండలం మొగుళ్లూరు పంచాయతీ పరిధిలోని గురువాయపాలెం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో శనివారం ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి కాకాణి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.స్థానిక నాయకులు కుంకు శోభన్‌బాబు, వద్దినేని మాల్యాద్రి, నాగెళ్ల రమేష్ ఆధ్వర్యంలో వద్దినేని రాజగోపాల్, కుంకు జయరామయ్య, వద్దినేని నారాయణ, బిరదవోలు శివ, నీరుపోగు రమేష్ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం** ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలపై నమ్మకంతో, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరిచేందుకు పార్టీలో చేరుతున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. కొత్తగా చేరిన వారిని కుటుంబ సభ్యుల్లా ఆదరిస్తామని పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ వైపు వస్తున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చాయి.

**2029 ఎన్నికలే లక్ష్యంగా ముందుకు** వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని నాయకులు కోరారు. 2029 సాధారణ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురువాయపాలెం గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.











## 61, 64 డివిజన్లలో టీడీపీ ఎన్నికల ప్రచారం

▶▶ ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ సింధూర..

అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను అభ్యర్థన

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 61, 64వ డివిజన్లలో తెలుగుదేశం పార్టీ ప్రచారం ఉత్సాహంగా సాగింది. మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర ఎన్నికల ప్రచారంలో పాల్గొని కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారంలో సందడి చేశారు.ప్రచారంలో భాగంగా డాక్టర్ సింధూర స్థానిక వ్యాపారులను, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఆమెకు పలువురు స్థానికులు స్వాగతం పలుకుతూ పూలు చల్లారు. ప్రజలతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ అభ్యర్థుల తరఫున మద్దతు కోరారు.

**నగరాభివృద్ధిపై ప్రస్తావన** ఈ సందర్భంగా డాక్టర్ సింధూర మాట్లాడుతూ మంత్రి నారాయణ నేతృత్వంలో నెల్లూరు నగరంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గత రెండేళ్ల మూడు నెలల కాలంలో నగర సుందరీకరణతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి నారాయణ కృషి చేస్తున్నారని అన్నారు. నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు టీడీపీ అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

**అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి** నెల్లూరు నగరపాలక సంస్థ 64వ డివిజన్ టీడీపీ అభ్యర్థి షేక్ నజిమా, 61వ డివిజన్ అభ్యర్థి రంగమయూర్ రెడ్డి, మేయర్ అభ్యర్థి పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్‌లను మంచి మెజారిటీతో గెలిపించాలని డాక్టర్ సింధూర ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

ప్రచార కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఆయా డివిజన్లలో అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేస్తామని పార్టీ శ్రేణులు తెలిపాయి.

## అభివృద్ధికి పట్టం కట్టండి: షరణి పొంగూరు

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరు నగరంలోని 15, 21, 22, 23వ డివిజన్లలో మంత్రి నారాయణ కుమార్తె షరణి పొంగూరు రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా ఓ టిఫిన్ దుకాణంలో దోసెలు వేస్తూ, బోండాలు తయారుచేసి అందరినీ ఆకట్టుకున్నారు.గత రెండున్నరేళ్లలో నగరాభివృద్ధికి ప్రభుత్వం రూ.5,748 కోట్లు కేటాయించిందని, డ్రైనేజీ, పార్కుల ఆధునీకరణ, పాఠశాలల అభివృద్ధి, మంచినీటి సరఫరా వంటి కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు. అభివృద్ధిని కొనసాగించేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్ లక్షకు పైగా మెజారిటీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచారంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రూప్‌కుమార్ యాదవ్, తాళ్లపాక అనురాధ, పలువురు కార్పొరేటర్ అభ్యర్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.










# కలువాయిలో నామినేషన్ల ఆమోదంపై వివాదం

- కుల్లూరు సెగ్మెంట్‌లో ఇద్దరు వైసీపీ అభ్యర్థులపై జనసేన అభ్యర్థి అభ్యంతరం
- కలెక్టర్‌కు అప్పీల్ చేస్తామని రామారావు వెల్లడి

**కలువాయి,(అక్షర దర్శిని):** నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన అనంతరం కుల్లూరు సెగ్మెంట్‌లో ఇద్దరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్ల ఆమోదంపై వివాదం తలెత్తింది. ఉపాధి హామీ పథకం నిధుల రికవరీకి సంబంధించిన వివరాలను నామినేషన్ పత్రాల్లో వెల్లడించలేదంటూ జనసేన అభ్యర్థి రామారావు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినప్పటికీ రిటర్నింగ్ అధికారి నామినేషన్లను ఆమోదించడంతో, జిల్లా కలెక్టర్‌కు అప్పీల్ చేస్తానని ఆయన ప్రకటించారు.కలువాయి ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు దాఖలైన 66 నామినేషన్లను రిటర్నింగ్ అధికారి సుబ్బారాజు పరిశీలించారు. ఈ క్రమంలో కుల్లూరు సెగ్మెంట్‌కు చెందిన ఇద్దరు వైసీపీ అభ్యర్థుల నామినేషన్లపై రామారావు అభ్యంతరాలు లేవనెత్తారు. సదరు అభ్యర్థులు ఉపాధి హామీ పథకం నిధుల దుర్వినియోగానికి సంబంధించి రికవరీ చర్యలు ఎదుర్కొంటున్నారని, ఆర్‌ఆర్ యాక్ట్ కింద ఉత్తర్వులు జారీ అయ్యాయని రామారావు ఆరోపించారు. ఈ వివరాలను నామినేషన్ పత్రాల్లో పేర్కొనలేదని, సంబంధిత అంశాలను పరిశీలించి నామినేషన్లను తిరస్కరించాలని అధికారిని కోరినట్లు తెలిపారు. అయితే, అభ్యంతరాల నేపథ్యంలోనూ రిటర్నింగ్ అధికారి ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. దీంతో ఆ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేసిన రామారావు, తన అభ్యంతరాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అప్పీల్ చేస్తానని వెల్లడించారు.మరోవైపు, నామినేషన్ల పరిశీలన ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. కుల్లూరు సెగ్మెంట్‌లో అభ్యర్థులపై వచ్చిన ఆరోపణలు, నామినేషన్ల ఆమోదంపై లేవనెత్తిన అభ్యంతరాలపై సంబంధిత అధికారుల నుంచి తదుపరి స్పష్టత రావాల్సి ఉంది. ఆరోపణలపై స్వతంత్ర ధ్రువీకరణ లేదా ఉన్నతాధికారుల నిర్ణయం వెలువడాల్సి ఉండటంతో ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు

- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి కలెక్టరేట్ అక్షర దర్శిని :** జిల్లాలో స్థానిక సంస్థల (మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ సర్పంచ్) ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున, జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మరియు డైలీ గ్రివెన్స్ కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ సందర్భంగా అక్టోబర్ 14 నుండి ఎన్నికల ప్రక్రి య ముగిసే వరకు కలెక్టరేట్, డివిజన్, మండల స్థాయిలో ప్రతి సోమ వారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# రేపు శ్రీ గోవిందరాజస్వామివారి పౌర్ణమి గరుడ సేవ

**తిరుపతి కల్చరల్ అక్షర దర్శిని :** పౌర్ణమి సందర్భంగా అక్టోబరు 26న సోమవారం తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి గరుడసేవ జరుగనుంది. ప్రతినెల పౌర్ణమి పర్వదినాన గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల నడుమ శ్రీ గోవిందరాజస్వామివారు గరుడునిపై ఆలయ ప్రధాన వీధులలో విహరించి భక్తులకు దర్శనమిస్తారు.

## వెయ్యి ఓట్ల మెజారిటీతో గెలుపొందాలి..

**నెల్లూరు రూరల్ అక్షర దర్శిని :** నెల్లూరు రూరల్ పరిధిలోని 37వ డివిజన్ లో కూటమి అభ్యర్థి రసూల్ వెయ్యి ఓట్ల మెజారిటీతో గెలుపొందేలా ప్రతి ఒక్కరు సమిష్టిగా పనిచేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ లు పిలుపునిచ్చారు. గత రెండు సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వ హాయంలో జరిగిన వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. 37వ డివిజన్ అభ్యర్థి అబ్దుల్ రసూల్, జలదంకి సుధాకర్, పెంచలనాయుడు, కనుపర్తి గంగాధర్, జిలానీ, అస్లాం, మౌలాలీ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ పోలీసుల ఫ్లాగ్ మార్చ్.. కార్డన్ అండ్ సెర్చ్









- 25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- శాంతియుత ఎన్నికలే లక్ష్యం.. ప్రజలకు భద్రతపై భరోసా

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు నెల్లూరు జిల్లా పోలీసులు విస్తృత భద్రతా చర్యలు చేపడుతున్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు వేదాయపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడంతో పాటు, మనుబోలు మండలం అక్కంపేట గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.

**శ్రీలంక కాలనీ, రామకోటయ్య నగర్‌లో ఫ్లాగ్ మార్చ్** వేదాయపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీలంక కాలనీ, రామకోటయ్య నగర్ ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు భద్రతపై భరోసా కల్పించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

**అక్కంపేటలో తనిఖీలు.. 25 వాహనాలు స్వాధీనం** మనుబోలు మండలం అక్కంపేట గ్రామంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామంలోని ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై ఆరా తీశారు. సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు** ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా ప్రజలకు ఎన్నికల నియమావళి, శాంతియుత ఎన్నికల ప్రాముఖ్యతపై పోలీసులు అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం, ఘర్షణలకు పాల్పడడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల నియమాలను పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు భద్రతా చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# 61 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- 8 మంది స్మగ్లర్లు అరెస్టు..ఒక ట్రాక్టర్, రెండు కార్లు సీజ్

**గూడూరు అక్షర దర్శిని :** గూడూరు అటవీ పరిధిలో 61 ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని, 8మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఎర్రచందనం దుంగలు కలిగిన ట్రాక్టర్, రెండు కార్లు సీజ్ చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గ నిర్దేశకత్వంలో ఆర్ ఐ కృపానంద, ఎఫ్ఆర్వో సుభాష్ శుక్రవారం గూడూరు అటవీప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ కొండగుంట-మేకనూరు మార్గంలో వెళుతుండగా అక్కడ అలికిడి వినిపించింది. అటు వైపు వెళ్లి చూడగా కొంతమంది ఎర్రచందనం దుంగలు కలిగిన ట్రాక్టర్ తో కనిపించారు. సమీపంలో రెండు కార్లు ఉండటంతో, టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిని చుట్టుముట్టారు. ట్రాక్టర్ లో 24, కింద 22 దుంగలు కలిపి 46 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కాగా విచారించడంతో మరో ప్రాంతంలో దాచి ఉంచిన మరో 15 ఎర్రచందనం దుంగలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీరి నుంచి రెండు కార్లు, ఒక ట్రాక్టర్ ను సీజ్ చేసి, అక్కడ ఉన్న 8మందిని అరెస్ట్ చేశారు. వారిని దుంగలు, వాహనాలు కలిపి తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. పట్టుబడిన వారిని డీఎస్పీ వీ.శ్రీనివాసులు రెడ్డి విచారించారు. సీఐ ఖాదర్ భాష కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# టీడీపీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలి





- ఇందుకూరుపేట జడ్పీటీసీ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు

**నెల్లూరు,(అక్షర దర్శిని):** పార్టీలో ఎన్ని గ్రూపులు ఉన్నా, ఎన్నికల సమయంలో అందరూ తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నాయకులందరూ సమన్వయంతో పనిచేసి, ఇందుకూరుపేట జడ్పీటీసీ కూటమి అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.శనివారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ఇందుకూరుపేట మండల నాయకులతో ఆమె స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

**అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పనిచేయాలి** ప్రతి గ్రామంలో రెండు, మూడు గ్రూపులు ఉండటం సహజమని, అయితే పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అందరూ ఒకే తాటిపైకి రావాలని ప్రశాంతి రెడ్డి అన్నారు. పార్టీలో ఎన్ని గ్రూపులు ఉన్నా చివరకు మనందరిదీ టీడీపీ గ్రూపేనని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. స్థానిక నాయకులు వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**అభ్యర్థి విజయానికి సమష్టి కృషి** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని జడ్పీటీసీ అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆయనకు ప్రజల్లో పరిచయం ఉందని పేర్కొంటూ, ఆయన విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు.

**ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ప్రచారం** నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రచారాన్ని ప్రారంభిస్తామని ప్రశాంతి రెడ్డి తెలిపారు. అప్పటివరకు ముఖ్య నాయకులు, స్థానిక నేతలు, మండల పార్టీ అధ్యక్షులు సమావేశమై ప్రచార ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమన్వయంతో ముందుకు సాగుతూ కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో ఇందుకూరుపేట జడ్పీటీసీ కూటమి అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.